RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

విలేకరులు కావలెను

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

Published at Karimnagar circulated in : Telangana | సంపుటి : 04 | సంచిక : 45 | ఎడిటర్ :పొన్నం ప్రసాద్ గౌడ్ | గురువారం 15-01-2026 | పేజీలు -8 | వెల: రూ. 05.00

పాఠకులకు ,ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు

సంక్రాంతి

శుభాకాంక్షలు

నేడు మా కార్యాలయానికి సెలవు.
కావున శుక్రవారం 16-01-2026 సంచిక వెలువడదు
పునర్దర్శనం శనివారం 17-01-2026




## సంక్రాంతి సంబురాలు.

- కేంద్రమంత్రి ఇంట్లో పొంగలి వండిన ప్రధాని



2 లో

# కొత్త సర్పంచులకు ట్రైనింగ్

**సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు**


- 19 నుంచి ఫిబ్రవరి 21 వరకు తరగతులు
- జిల్లాల వారీగా షెడ్యూల్ ఖరారు
- మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు టీజీఐఆర్డీ ద్వారా శిక్షణ
- శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు మొత్తం 253 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక
- చట్టంపై అవగాహన, ప్రజలకు మెరుగైన సేవే లక్ష్యంగా కార్యక్రమాలు

హైదరాబాద్

గ్రామ పరిపాలనను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సమగ్ర శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ శిక్షణా షెడ్యూల్‌ను ఖరారు చేసింది. సర్పంచ్‌లకు వారి విధులు, నిధులు, బాధ్యతలు, హక్కులతో పాటు చట్టంపై లోతైన అవగాహన కల్పించేలా శిక్షణా మాడ్యూల్‌ను రూపొందించారు. ఇప్పటికే సర్పంచ్‌ల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్, కరదీపికను సిద్ధం చేశారు. మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు టీజీఐఆర్డీ ద్వారా శిక్షణను అందించనున్నారు.

-మిగతా 2 లో





## ఇరాన్‌ను తక్షణమే వీడండి

- ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి
- పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలి
- భారతీయులకు విదేశాంగశాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ ,

ఇరాన్‌లో కొనసాగుతున్న రాజకీయ అస్థిరత, హింసాత్మక నిరసనలు మరియు భద్రతా పరిస్థితుల దృష్ట్యా, భారత ప్రభుత్వం తన పౌరులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్‌లోని అన్ని భారతీయ పౌరులు, విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు లేదా పర్యాటకులు అందుబాటులో ఉన్న మార్గాలను ఉపయోగించి వీలైనంత త్వరగా దేశం విడిచి వెళ్లాలని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం కోరింది. జనవరి 5న భారత ప్రభుత్వం జారీ చేసిన సలహాకు ఈ సలహా పొడిగింపు అని రాయబార కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.. ఇరాన్‌లో నిరంతరం మారుతున్న పరిస్థితుల దృష్ట్యా , వాణిజ్య విమానాలు సహా అందుబాటులో ఉన్న ఏదైనా రవాణా మార్గం ద్వారా భారతీయ పౌరులు ఇరాన్‌ను విడిచి వెళ్లాలని సూచించారు.ఇరాన్‌లో ఉన్న అన్ని భారతీయ పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నిరసనలు లేదా రద్దీగా ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలని

-మిగతా 2 లో



## దాడి చేస్తే ప్రతీకారమే

- ట్రంప్‌కు ఇరాన్ హెచ్చరిక
- వెనక్కి తగ్గిన అమెరికా
- వైమానిక బేస్‌ల నుంచి సిబ్బంది ఉపసంహరణ

దుబాయ్/దోహా

తమ దేశంపై అమెరికా దాడి చేస్తే ప్రతీకారం తప్పదని ఇరాన్ హెచ్చరించింది. దీనితో వాషింగ్టన్ ఓ అడుగు వెనక్కి వేసింది. అమెరికా మధ్యప్రాచ్యంలోని వైమానిక స్థావరాల నుంచి కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకుంది. ఈ విషయాన్ని బుధవారం అమెరికా అధికారవర్గాలు ధ్రువీకరించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్ ఎదుర్కొంటున్న దేశీయ అశాంతిని అణచివేయడానికి ఇరాన్ నాయకత్వం ప్రయత్నిస్తున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేక నిరసనకారుల తరపున జోక్యం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే బెదిరింపు ప్రకటనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అమెరికాకు గట్టి సమాధానం ఇచ్చేందుకు టెహ్రాన్ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరిగిన

-మిగతా 2 లో



## చట్టప్రకారమే విలేకర్ల అరెస్ట్

- మహిళా ఐఏఎస్ పై అసత్య కథనాలు
- విచారణకు రమ్మంటే పారిపోతే ఎలా
- రాత్రికి రాత్రే ఫ్లైట్ టిక్కెట్ బుక్ చేసుకుని పరారీ
- అందుకే ఇద్దరిని అరెస్ట్ చేశాం..వివరాలు త్వరలో వెల్లడిస్తాం
- మీడియాతో నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్

హైదరాబాద్

ఒక మహిళా ఐఏఎస్ అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఈ కేసులో మీడియా ప్రతినిధుల అరెస్టుపై సీపీ స్పందించారు. మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలన్నారు. నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తాం. ఓ టీవీ ఛానెల్ సీఈవో ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. పిలిస్తే.. విచారణకు రావాలి కదా అంటూ.. రిపోర్టర్లు ఎందుకు పారిపోతున్నారని అన్నారు.అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నాం. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి

-మిగతా 2 లో

## 18న ఖమ్మం జిల్లాలో సీఎం పర్యటన

- సిపిఐ మహాసభలకు రేవంత్ హాజరు



ఖమ్మం,

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 18న ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సీపీఐ జాతీయ మహసభల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. అదేరోజు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో రూ.25 కోట్లతో నూతనంగా నిర్మించిన మద్దులపల్లి మార్కెట్ యార్డ్, రూ.25 కోట్లతో నిర్మించిన నర్సింగ్ కళాశాల ను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా రూ.108

-మిగతా 2 లో

## చేనేత రుణమాఫీకి రూ.16.27 కోట్లు

- 6,784 మంది కార్మికులకు లబ్ధి
- వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



2 లో

# సజ్జనార్ కాంగ్రెస్ కండువా కప్పుకో

**పండుగ పూట జర్నలిస్టుల అక్రమ అరెస్టులా?**

- అర్ధరాత్రి పట్టుకెళ్లేందుకు వాళ్లు తీవ్రవాదులా?
- మీడియా గొంతు నొక్కేందుకు రేవంత్ యత్నం
- మీ రాజకీయ వికృత క్రీడకు వారు బలికావాలా?
- మీడియాకు స్వేచ్ఛ ఇస్తున్నామని గప్పాలు కొట్టి
- ఇప్పుడు నియంతలా రేవంత్ వ్యవహారం: హరీశ్
- జర్నలిస్టులను విడుదల చేయాలని డీజీపీకి ఫోన్



జహీరాబాద్/హైదరాబాద్,

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'మీ ఖాకీ బుక్ ఏం చెప్తుందో ఒకసారి చూసుకోండి' అని సూ చించారు. బుధవారం జహీరాబాద్ ఎమ్మె ల్యే క్యాంపు ఆఫీస్‌లో ఆయన విలేకరుల తో మాట్లాడారు. జర్నలిస్టుల అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 'గతంలో కేటీఆర్‌పై మీ మంత్రి అడ్డగోలు వ్యాఖ్యలు చేసినప్పుడు బాధపడ్డది కూడా ఒక మహిళే కదా? అప్పుడు మీ పోలీసు లేం చేశారు? మీ చట్టం నిద్రపోయిందా?' అని ప్రశ్నించారు. అప్పుడు ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు.

-మిగతా 2 లో

## భోగి వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

- సంప్రదాయ ముగ్గుల పోటీలు..ఎడ్ల బండ్లపై ఊరేగింపు
- స్థానిక చిన్నారులకు ఆటల పోటీలు..పాల్గొన్న దేవాన్ష్
- గంగిరెద్దుల విన్యాసాలతో సందడిగా నారావారి పల్లె

కుప్పం

సంస్కృతి, సంప్రదాయలు చాటి చెప్పేలా నారావారిపల్లిలో భోగి పండగ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ భోగి వేడుకల్లో సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబసమేతంగా పాల్గొంటున్నారు. వరుసగా రెండోరోజు తన స్వగ్రామం నారావారిపల్లెలో సంక్రాంతి వేడుకల్లో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలు భార్య భువనేశ్వరితో సహా కుటుంబసభ్యులతో కలిసి సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. ఇక బుధవారం భోగి పండగ వేళ.. సీఎం చంద్రబాబు మనవడు దేవాన్ష్, నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్వినీ, శ్రీభరత్ దంపతుల పిల్లలు ఎద్దుల బండిలో ఊరేగారు. ఈ సందర్భంగా ఎద్దుల బండిని బెలూన్లతో అందంగా అలంకరించారు. ఈ ఎద్దుల బండిపై వారు వారంతా అటుఇటు తిరిగారు. దేవాన్ష్‌తోపాటు శ్రీభరత్ దంపతుల చిన్నారులు సైతం

-మిగతా2 లో



# కొత్త సర్పంచులకు ట్రైనింగ్

మొదటి తరువాయి




గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలు, పారదర్శక పరిపాలన లక్ష్యంగా ఈ శిక్షణ ఉండనుంది. సర్పంచ్‌లు బాధ్యతాయుతంగా పనిచేసేలా, గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా శిక్షణా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ నెల 19 నుంచి ఫిబ్రవరి 21 వరకు జిల్లాలవారీగా శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలో ఐదు బ్యాచ్‌లుగా ఐదు రోజుల పాటు సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తారు. ఒక్కో బ్యాచ్‌లో కనీసం 50 మంది సర్పంచ్‌లు పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12,760 మంది సర్పంచ్‌లకు బస, భోజనం, శిక్షణా ఖర్చుల కోసం ఒక్కరికి రూ.5,000 వరకు ప్రభుత్వం వెచ్చించనుంది. శిక్షణను సమర్థవంతంగా అందించేందుకు మొత్తం 253 మంది మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేసి, వారికి టీజీఐఆర్డీలో ఇప్పటికే ఓరియంటేషన్ పూర్తిచేశారు. వీరు సర్పంచ్‌లకు ప్రాక్టికల్‌గా ఉపయోగపడే విధంగా, పాలన, అభివృద్ధి, ఆర్థిక నిర్వహణ, ప్రజాసేవ అంశాలను బోధిస్తారు. సర్పంచ్ శిక్షణా తరగతుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీచేసింది. సర్పంచ్‌లకు సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా గ్రామ పంచాయతీలు బలోపేతం అవుతాయనీ, పారదర్శకమైన పాలన, సమర్థవంతమైన నిధుల వినియోగం, ప్రజల అవసరాలకు వేగంగా స్పందించే వ్యవస్థ ఏర్పడుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

# ఇరాన్‌ను తక్షణమే వీడండి

మొదటి తరువాయి

మరియు పరిస్థితిపై తాజా పరిస్థితుల కోసం స్థానిక మీడియాను ఫాలో కావాలని భారత రాయబార కార్యాలయం తెలిపింది.. భారత పౌరులు తమ ప్రయాణ మరియు ఇమ్మిగ్రేషన్ పత్రాలన్నింటినీ పాస్‌పోర్ట్‌లు మరియు గుర్తింపు కార్డులు వంటివి ? ఎల్లప్పుడూ తమ వద్ద ఉంచుకోవాలని.. తక్షణమే అందుబాటులో ఉండాలని రాయబార కార్యాలయం కోరుతోంది. వారికి ఏదైనా సహాయం అవసరమైతే వెంటనే భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కూడా వారు కోరారు. ఇటీవలి ఇరాన్‌లో విస్తృత నిరసనలు, హింస మరియు భద్రతా చర్యలు జరిగాయి, దీనివల్ల విదేశీ పౌరుల భద్రత గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్య తీసుకుంటామని అమెరికా బెదిరిస్తూనే ఉన్న విషయం విదితమే..

# 18న ఖమ్మం జిల్లాలో సీఎం పర్యటన

మొదటి తరువాయి

కోట్లతో నిర్మించబోయే జేఎన్‌టీయూ భవన నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించే అవకాశం ఉంది. అందులో భాగంగా మద్దులపల్లి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని సీపీ సునీల్‌దత్, ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ పిల్లి.రాంప్రసాద్, మార్కెట్ చైర్మన్ హరినాదబాబులు పరిశీలించారు.

# సంక్రాంతి సంబురాలు.

## కేంద్రమంత్రి ఇంట్లో పొంగలి వండిన ప్రధాని



న్యూఢిల్లీ

ప్రధాని నరేంద్రమోదీ సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. దేశ రాజధాని డిల్లీలో కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ వేడుకల లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు సంక్రాంతి శుభాంకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రధాని గోవులకు పూజ చేశారు. ఆ తర్వాత పొంగలి వండారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు కూడా ఉన్నారు.సంక్రాంతి వేడుకల అనంతరం మోదీ మాట్లాడుతూ.. గత ఏడాది తాను తమిళనాడులో జరిగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైనట్లు గుర్తుచేసుకున్నారు. వెయ్యి సంవత్సరాల పురాతనమైన గంగైకొండ చోళపురం ఆలయ సందర్శన, పంబన్ వంతెన ప్రారంభోత్సవ సమయాల్లో తమిళుల చరిత్ర గొప్పతనాన్ని తెలుసుకున్నట్లు తెలిపారు. కొన్ని నెలల క్రితం సహజ వ్యవసాయంపై తమిళనాడులో జరిగిన ఓ సమావేశానికి తాను హాజరైనట్లు మోదీ చెప్పారు. లాభదాయకమైన వృత్తులను వదిలి, వ్యవసాయం వైపు మళ్లిన యువతను తాను అక్కడ కలిశానని, వ్యవసాయ రంగంలో విప్లవాన్ని తీసుకురావడానికి వారు చేస్తున్న కృషిని మరింత విస్తరించాలని నిర్ణయించుకున్నానని ప్రధాని అన్నారు. దేశంలో వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, పర్యావరణానికి అనుకూలంగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే కాలంలో స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, నీటి నిర్వహణ, సహజ వ్యవసాయం, వ్యవసాయ సాంకేతికత వంటివి అందుబాటులోకి తీసుకువస్తామని ప్రధాని చెప్పారు. రైతులు దేశ నిర్మాణంలో బలమైన భాగస్వాములని, వారిని మరింత శక్తిమంతంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం నిబద్ధతతో పనిచేస్తోందని అన్నారు.

# సజ్జనార్ కాంగ్రెస్ కండువా కప్పుకో..

మొదటి తరువాయి

జర్నలిస్టులు వా ర్త రాస్తే తలుపులు పగులగొట్టి అరెస్ట్ చేస్తారని, కానీ కాంగ్రెస్ నేతలు బెదిరించినా కేసులు ఉండవని విమర్శించారు. మంత్రి కంపెనీ పేదోళ్ల భూమి కబ్జాచేస్తే, వారికి రక్ష ణ కల్పిస్తున్నారే తప్ప అరెస్ట్ చేయలేదని, నిజాయితీగా పనిచేసిన సీఐని మాత్రం బ దిలీ చేశారని మండిపడ్డారు. ఎన్‌హెచ్–44 కాంట్రాక్టర్‌ను కాంగ్రెస్ ఏఐసీసీ నేత సంపత్‌కుమార్ డబ్బులు కోసం బెదిరించారని 9న ఫిర్యాదు చేసినా అర్ధరాత్రి ఎం దుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. 'సిద్దిపేటలో నాపై కాంగ్రెస్ నాయకులు అనరాని మాటలు మాట్లాడారు. వారిపై ఫిర్యా దు చేసి ఇన్ని రోజులైనా కేసు నమోదు కా లేదు' అని పేర్కొన్నారు. సీఎం సన్నిహితు డు రోహిన్‌రెడ్డి ఒక పారిశ్రామికవేత్త తలకు తుపాకీ పెట్టి డబ్బులు వసూలు చేశాడని మంత్రి కూతురు మీడియాకు చెప్పినా సిట్ ఎందుకు వేయలేదని నిలదీశారు.

**జర్నలిస్టులు ఏమైనా తీవ్రవాదులా?**

అక్రమంగా అరెస్టులతో మీడియా సం స్థలను తన గుప్పిట్లోకి తెచ్చుకోవాలని రే వంత్ ప్రయత్నిస్తున్నారని హరీశ్ విమర్శించారు. 'మీడియా అంటే ఆయనకు ఎందు కో కోపం. జర్నలిస్టులను చూస్తే చెంపలు పగులగొట్టాలని అనిపిస్తుందని గతంలో మాట్లాడి, ఇప్పుడు, ఆ కసిని బయట పె ట్టుకున్నారు' అని



మండిపడ్డారు. జర్నలిస్టులేమైనా తీవ్రవాదులా? సంఘవిద్రో హ శక్తులా? నోటీసులిచ్చి విచారణ చేపట్టవచ్చన్నారు. అరెస్టులు, మీడియాపై సిట్‌లతో ఎవరిని కా పాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారు?' అని ప్రశ్నించారు.

**ప్రైవేట్ సైన్యంలా పోలీసులు**

శనివారాలు, అర్ధరాత్రుల్లో రేవంత్‌లో ని అరాచకవాది నిద్రలేచి పేదల ఇండ్లు కూలగొడతారని హరీశ్‌రావు ఎద్దేవా చేశా రు. హోం శాఖను అడ్డుపెట్టుకొని పోలీసులను ప్రైవేటు సైన్యంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. గతంలో అల్లు అర్జున్, మంత్రి సురేఖ ఇండ్ల మీదికి కూడా పంపి న ఘనత రేవంత్‌కే దక్కిందన్నారు. జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారి పోరాటానికి బీ ఆర్ఎస్ మద్దతు ఉంటుందని ప్రకటించా రు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మె ల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఉన్నారు.

**డీజీపీకి హరీశ్‌రావు ఫోన్**

రాష్ట్రంలో జర్నలిస్టుల వరుస అరెస్టుల విషయమై డీజీపీతో హరీశ్ ఫోన్‌లో మా ట్లాడారు. 'నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి.. పండుగ పూట జర్నలిస్టులను ఎలా అరెస్టులు చేస్తారు? జర్నలిస్టులేం క్రిమినల్స్ కాదు, టెర్రరిస్టులు కాదు? ఎందుకంత కఠినంగా వ్యవహరిస్తున్నారు?' అని ప్రశ్నించారు. వాళ్ల కుటుంబాలు మానసిక వేదనకు గురవుతాయని, పండుగ పూట అరెస్టులు సరికాదని సూచించారు.

# దాడి చేస్తే ప్రతీకారమే

మొదటి తరువాయి

ప్రాంతాల్లోని కీలక స్థావరాల నుంచి అమెరికా కొంతమంది సిబ్బందిని ఉపసంహరించుకోవడం గమనార్హం. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా సైనిక జోక్యం జరిగే అవకాశం ఉందని యూరోపియన్ అధికారులు తెలిపారు. రాబోయే 24 గంటల్లో దీనిపై ట్రంప్ నిర్ణయం తీసుకుంటారని ఓ ఇజ్రాయిల్ అధికారి తెలిపారు. అయితే దాని పరిధి, సమయాన్ని స్పష్టంగా చెప్పలేదు.

**ఖతార్‌లో యూఎస్ ఎయిర్‌బేస్**

ఖతార్‌లోని అతిపెద్ద యూఎస్ స్థావరం అయిన అల్ ఉదీద్ వైమానిక స్థావరం నుంచి ఉపసంహరణలు జరుగుతున్నాయని ఖతార్ దేశం కూడా తెలిపింది. గతేడాది ఇరాన్ క్షిపణి దాడికి కొన్ని గంటల ముందు జరిగినట్టుగా పెద్ద సంఖ్యలో సైనికులను సాకర్ స్టేడియం, షాపింగ్ మాల్‌కు బస్సుల్లో తరలించినట్లు తక్షణ సంకేతాలు లేనప్పటికీ, కొంతమంది సిబ్బందిని స్థావరం నుంచి బయటకు వెళ్లమని చెప్పినట్టు ముగ్గురు దౌత్యవేత్తలు తెలిపారు. ఇరాన్‌లో రెండు వారాల క్రితం ఆ దేశ ఆర్థిక పరిస్థితులకు వ్యతిరేకంగా ప్రదర్శనలుగా ప్రారంభమయ్యాయి. ఈ అశాంతిని ఇటీవలి రోజుల్లో వేగంగా తీవ్రతరం చేసి, ఇరాన్‌లో మతాధికారుల పాలనను స్థాపించిన 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అత్యంత హింసాత్మకమైనదంటూ ఆదేశంపై పాశ్చాత్య దేశాలు ప్రచారం చేస్తున్నాయి. ఈ నిరసనల్లో 2,600 మందికి పైగా మరణించారని ఒక



హక్కుల సంస్థ పేర్కొన్నట్టు వార్తల్ని విస్తృతం చేశారు. అయితే ఇరాన్ ఇంతటి విధ్వంసాన్ని ఎప్పుడూ ఎదుర్కోలేదని ఆ దేశ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దుల్‌రహీం మౌసావి బుధవారం తెలిపారు. పాశ్యాత్య దేశాల ప్రచారాన్ని విదేశీ శత్రువులని పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌లోని అంతర్గత వ్యవహారాలపై ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి జీన్–నోయెల్ బారోట్ మాట్లాడుతూ ఇరాన్ సమకాలీన చరిత్రలో ఇదో అత్యంత హింసాత్మక అణచివేత అని కామెంట్స్ చేశారు. దీనిని కూడా ఇరాన్ అధికారులు సమర్థవంతంగా తిప్పికొడుతున్నారు. తమ దేశంలో అశాంతిని సాయుధ ఉగ్రవాదుల పేరుతో అమెరికా, ఇజ్రాయిల్ రెచ్చగొడుతున్నాయని చెప్పారు. మరోవైపు యూఎస్ ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుంటే, సౌదీ అరేబియా, యూఏఈ నుంచి టర్కీ వరకు ప్రాంతీయ దేశాల్లోని అమెరికా స్థావరాలపై దాడి చేస్తామని టెహ్రాన్ స్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలోనే ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మధ్య ప్రత్యక్ష సంబంధాలను నిలిపివేశారు. ఖతార్‌లోని అల్ ఉదీద్‌లో సెంట్రల్ కమాండ్ ఫార్వర్డ్ హెడ్‌క్వార్టర్స్, బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీకి చెందిన ఐదవ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంతో సహా ఈ ప్రాంతం అంతా యూఎస్ బలగాల స్థావరాలు ఉన్నాయి. ఇరాన్ ప్రభుత్వం పతనం అంచున ఉన్నట్టు కనిపించడం లేదంటూ ఓ పాశ్చాత్య అధికారి చెప్తూ, అక్కడి మరణహోమం తీవ్రంగా ఉందంటూ ఆరోపణలు చేశారు. గతేడాది జూన్‌లో ఇరాన్‌పై ఇజ్రాయిల్ ద్వారా అమెరికా నేరుగా బాంబుదాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. అయితే దీన్ని ఇరాన్ సమర్థవంతంగా తిప్పికొట్టి, అమెరికాకు వెన్నులో వణుకు పుట్టించింది. దీనితో అప్పుడు తాత్కాలికంగా వెనక్కి తగ్గిన అమెరికా, ఇప్పుడు ఆ దేశంలో అంతర్యుద్ధం ద్వారా రాజకీయ అస్థిరత సృష్టించాలని ప్రయత్నిస్తోంది.

# చేనేత రుణమాఫీకి రూ.16.27 కోట్లు

-6,784 మంది కార్మికులకు లబ్ది

-వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

హైదరాబాద్



చేనేత కార్మికుల రుణమాఫీ కోసం రూ.16.27 కోట్ల అదనపు నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రూ. 33 కోట్ల నిధులు చేనేత కార్మికుల అకౌంట్లలో జమ చేసేందుకు ఆయా జిల్లాలకు విడుదల చేశామని తెలిపారు. వాటికి అదనంగా ఈ నిధులను విడుదల చేస్తున్నట్టు తెలిపారు. 2017 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు వ్యక్తిగత రుణాలు తీసుకున్న చేనేత కార్మికులకు ఈ రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. ఫలితంగా మొత్తం 6,784 మంది లబ్ధి పొందుతున్నట్టు మంత్రి తుమ్మల వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత కార్మికుల సంక్షేమం కోసం రూ.960 కోట్లు ఖర్చు చేసిందని గుర్తుచేశారు. చేనేత కార్మికులకు ఎల్లప్పుడూ పని కల్పించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో నుంచే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ఇప్పటివరకు రూ.896 కోట్ల విలువైన వస్త్రాలకు వివిధ ప్రభుత్వ శాఖల నుంచి ఆర్డర్లు వచ్చాయని తెలిపారు. ఇందిరా మహిళాశక్తి చీరల పథకం ద్వారా 30 వేల మరమగ్గాలకు నిరంతరం పని కల్పించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. రూ.150 కోట్లతో చేనేత అభయహస్తం పథకాన్ని అమలు చేస్తున్నామనీ, గత ప్రభుత్వం కార్మికులకు బకాయి పడ్డ రూ.290 కోట్లను నేతన్నకు చేయూత పథకం కింద కార్మికుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఈ ఏడాది జిల్లా సహకార బ్యాంకుల ద్వారా 78 సహకార సంఘాలకు రూ.19 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ మంజూరు చేశామని మంత్రి వివరించారు.

# చట్టప్రకారమే విలేకర్ల అరెస్ట్

మొదటి తరువాయి

సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అందుకే వారిని అరెస్ట్ చేసి విచారిస్తున్నాం.త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తాం అంతా చట్ట ప్రకారమే చేస్తాం. చట్టం తనపని తాను చేసుకుపోతుందని సజ్జన్నార్ అన్నారు. ప్రజా జీవితంలో విమర్శలు సహజం. విమర్శలు సహేతుకంగా ఉండాలి. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిపై వ్యక్తిగత విమర్శలు చేయడం క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారు. మహిళా అధికారులపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని నిలదీసారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలి. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నమోదైంది. ఈ రెండు కేసులకు సంబంధించి సిట్ విచారణ జరుపుతోందని సీపీ తెలిపారు.

# భోగి వేడుకల్లో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా గ్రామంలోని పిల్లలందరికీ చేతులు ఊపుతూ ఎద్దుల బండిలో తిరిగారు. అనంతరం ఈ ఎడ్ల బండి దిగి.. స్థానికంగా ఉన్న చిన్నపిల్లకు వీరు షేక్ హ్యాండ్ ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పిల్లల్లో ఆనందం వెల్లువిరిసింది. తన స్వగ్రామం నారావారిపల్లిలో సంక్రాంతి సంబరాలు జరుపుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు మంత్రి నారా లోకేశ్ స్వగ్రామానికి చేరుకున్న సంగతి తెలిసిందే. నాలుగు రోజులపాటు వీరు స్వగ్రామంలోనే ఉండి.. సంక్రాంతి సంబరాలు జరుపుకోనున్నారు. మంగళవారం ఉదయం స్వగ్రామంలో ఏర్పాటు చేసిన.. ముగ్గుల పోటీలను సీఎం సతీమణి నారా భువనేశ్వరితోపాటు నారా బ్రాహ్మణి పరిశీలించారు. లాగే చిన్నారులకు ఆటల పోటీలు.. మ్యూజికల్ చైర్స్, బ్యాలెన్స్ వాకింగ్, గన్నీ బ్యాగ్ రేస్, లెమన్ అండ్ స్పూన్, కాక్గ ÷ట్, త్రీలెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భారీగా బాలురు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. అలాగే గ్రామస్తుల నుంచి అర్జీలను సీఎంతోపాటు ఆయన తనయుడు, మంత్రి నారా లోకేశ్ స్వీకరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా వారికి తండ్రి తనయులు భరోసా ఇచ్చారు. ఇక మంగళవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సైతం సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నాలుగు రోజులపాటు ఈ సంబరాల్లో పాల్గొని సీఎం చంద్రబాబు నాయుడు తిరిగి అమరావతికి చేరుకోనున్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి: డైరెక్టర్ పి అండ్ పి

**అక్షర వేదం:జనవరి 14,రామగిరి**

నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించాలని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు.వారు బుధవారం సింగరేణి రామగుండం-3 ఏరియా,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా లో పర్యటించారు.వారికి జి.యం కార్యాలయం నందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎస్.మధుసూదన్,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లు స్వాగతం పలికారు.అనంతరం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. మధుసూదన్ తో పాటు ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక,రవాణా,ఆర్.జి కోల్ మైన్ మొదలగు అంశాలపై చర్చించారు.తదుపరి అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, తో పాటు సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి 3వ ప్యానల్ సాల్వేజింగ్ పనుల పురోగతి,4వ ప్యానెల్ తయారీ పనుల పై చర్చించారు.ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన ఓ.బి,బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి భద్రతతో సాధించాలని,అందుకు



కావలసిన చర్యలను, ప్రణాళికను రూపొందించుకోవాలని, యంత్రాలు ఎక్కువ సమయం ఉపయోగించినందుకు అందుబాటులో ఉండేలా చూడాలని,పని విధానాన్ని మెరుగుపరుచుకోవాలని, ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇంకా రెండు నెలల సమయం మాత్రమే ఉందని, సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు తగిన చర్యలు, ప్రణాళికలను రూపొందించుకోవాలని, అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ సాల్వేజింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి భద్రతతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.నూతనంగా రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ గా పదవి బాధ్యతలను స్వీకరించిన ఎస్.మధుసూదన్ ను సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో ఎస్వోటు జి.యం యం.రామ్మోహన్, విభాగధిపతులు రాజా రెడ్డి,బి.టి.మురళి కృష్ణ,బి.వి.సత్య నారాయణ, ఐలయ్య, షబ్బీరుద్దీన్,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాష్ కళ్లు సజీవం...!

**-ఇంటిపెద్ద అకాల మరణంలోనూ.. ఇద్దరు అంధులకు వెలుగులు.**

**అక్షరవేదం/గోదావరిఖని: జనవరి14**

పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌కు చెందిన నిరుపేద కుటుంబం, తీరని విషాదంలోనూ మానవత్వాన్ని చాటుకుంది. కుటుంబ పెద్దను కోల్పోయిన దుఃఖాన్ని దిగమింగుకుని, ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దేవరకొండ ప్రకాష్ (57) బుధవారం మృతి చెందారు. కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించిన ప్రకాష్ అకాల మరణం వారి కుటుంబాన్ని తీవ్రంగా కలిచివేసింది. గోదావరిఖనిలోని మేదరిబస్తీలో చాలా కాలం చెప్పులు కుట్టిన ప్రకాష్, గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. హైదరాబాద్‌లో కుటుంబంతో ఉంటూ, అద్దె ఇంట్లో నివసిస్తూ జీవనం సాగించారు. కాగా, భర్త అకాల మరణంతో భార్య రమ, తండ్రి మరణంతో దిగ్భ్రాంతికి గురైన



కొడుకు ఉదయ్ ప్రకాష్, కూతుళ్లు--అల్లుళ్లు మౌనిక--నరేష్, మానస--ప్రభుదాస్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయినా, మృతుని ద్వారా సమాజానికి ఉపయోగం కలిగేలా ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. మృతుని నేత్రాలను దానం చేస్తే ఇద్దరు అంధులకు చూపు వస్తుందని ప్రకాష్ స్నేహితుడు, మాజీ పోలీస్ కానిస్టేబుల్, సదాశయ ఫౌండేషన్ జిల్లా సలహాదారులు దేవీ లక్ష్మీనర్సయ్య కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ల సహకారంతో ప్రకాష్ నేత్రాలను విజయవంతంగా దానం చేశారు. ఈ స్ఫూర్తిదాయక నిర్ణయానికి సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణా రెడ్డి, నూక రమేష్, కే.ఎస్. వాసు, పృథ్వీరాజ్, చింతకింద కనకయ్యతోపాటు రామగుండం లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, రాజేంద్ర కుమార్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి. మల్లికార్జున్, మాజీ కానిస్టేబుల్ దేవీ లక్ష్మీనర్సయ్య కుటుంబాన్ని ప్రశంసించారు. ప్రకాష్ అకాల మరణం పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**- బచ్చన్నపేటలో 'గృహజ్యోతి' పత్రాల పంపిణీ**

**బచ్చన్నపేట జనవరి 14(అక్షరవేదం):-**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా, బచ్చన్నపేట గ్రామంలో గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు మంజూరైన పత్రాలను బుధవారం పంపిణీ చేశారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంజూరు చేసిన ఈ పత్రాలను, స్థానిక సర్పంచ్ అల్వాల నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నల్లగోని బాలకిషన్ గౌడ్,లబ్ధిదారులకు అందజేశారు.ప్రజా ప్రభుత్వంలో భాగంగా నిరుపేదలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును అందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని బాలకిషన్ గౌడ్ పేర్కొన్నారు.విద్యుత్



బిల్లుల రూపంలో ఆదా అయ్యే డబ్బును ప్రజలు తమ పిల్లల చదువులకు,ఆరోగ్య అవసరాలకు మరియు నిత్యవసర వస్తువుల కొనుగోలుకు వినియోగించుకోవాలనేది ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు.?ప్రజలు చెల్లించాల్సిన సుమారు 3,593 కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలను ప్రభుత్వమే విద్యుత్ సంస్థలకు చెల్లిస్తుందని, ఇది ప్రజా ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. పేద ప్రజల ముఖాల్లో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చిట్టి రామ్మోహన్ రెడ్డి,చిమ్ముల సుధాకర్ రెడ్డి ఎండీ అజిమ్,పెద్దటి శ్రీను,కంటెమ్ కర్ణాకర్, రాగిరు సత్తయ్య, అందె శ్రీను,కర్రె సామెల్, గౌటే సిద్దలు,బొమ్మెన రాజయ్య, పాల్గొన్నారు.

# భాల్ని ధర్మారం గ్రామం లో సంక్రాంతి సంబరాలు గ్రామీణ ఆడపడుచులు వేసిన ముగ్గులు, గ్రామం లో ఆనంద హేలా..

**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా ,మరిపెడ మండలం, భాల్నిధర్మారం గ్రామం :-జనవరి 14.**

నేడు మరిపెడ మండలం భాల్నిధర్మారం గ్రామం లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకిన వేళ.నేడు భాల్ని ధర్మారం గ్రామం గ్రామ యువతులు ఉదయాన్నే లేచి ఇంటి పనులు చక చక చేసేసి ఆరుబయట కలాపి జల్లి వాడ వాడ లా రంగుల ముగ్గులతో గ్రామంలో కళకళలాడుతూ సంతోషంగా పండుగ నిర్వహించుకున్నారు.భాల్ని ధర్మారం యువత కేరింతల సప్పుళ్ళతో ఈ పండుగ ఘణంగా నిర్వహించుకున్నారు.వారు మాట్లాడుతూ మా గ్రామం లో చాలా మార్పు వచ్చింది.భాల్ని ధర్మారం




గ్రామ ప్రజల అందరి తరుపున రాష్ట్ర ప్రజలందరికీ సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు.

# కొనుగోలుదారులకు బీబీజీ సంక్రాంతి ఆఫర్లు

**-లక్కీడ్రాలో విజేతకు ఉచిత ప్లాట్ పంపిణీ**



**హైదరాబాద్, జనవరి 14 (అక్షర వేదం) :**

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్(బీబీజీ) సంక్రాంతి పండుగ వేళ తమ వినియోగదారులకు 'ఫ్రీ రిజిస్ట్రేషన్ నుండి ఫ్రీ ప్లాట్ వరకు' పేరుతో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం భారీ లక్కీ డ్రాను నిర్వహించి విజేతను ప్రకటించినట్లు బీబీజీ సంస్థ సీఎండీ మల్లికార్జున్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయన మాట్లాడుతూ బెవర్లీ హిల్స్ కాజా, ఫార్చ్యూన్ ఎంపైర్ సిటీ, క్యాపిటల్ వెస్ట్ లలో ప్లాట్లు కొనుగోలు చేసిన మొదటి 100 మంది కస్టమర్ల నుంచి లక్కీ డ్రా ద్వారా విజేతను ఎంపిక చేశాసినట్లు తెలిపారు. ఈ డ్రాలో వి.కిరణ్ అదృష్ట విజేతగా నిలిచారని తెలిపారు. బెవర్లీ హిల్స్ కాజాలో 30 లక్షల విలువైన 133 చదరపు గజాల ప్లాట్‌ను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. మిగతా 99 ప్లాట్ యజమానులకు రూ.10 వేల గిఫ్ట్ కూపన్లు బహుమతిగా అందజేసినట్లు చెప్పారు. ఈనెల 16 వరకు మరిన్ని సంక్రాతి ఆఫర్లు ప్రకటించినట్లు తెలిపారు.

# కార్మిక క్షేత్రాలలో ఘనంగా భోగి వేడుకలు



**అక్షర వేదం: జనవరి 14,రామగిరి**

కార్మిక క్షేత్రాలలో భోగి వేడుకలు రామగిరి మండలం సెంటినరీ కాలనీ కార్మిక క్షేత్రాలతో పాటు గ్రామ గ్రామాన బుధవారం ఘనంగా జరిగాయి. ప్రజల బతుకుల్లో వెలుగులు నింపాలని,మరింత సుఖ సంతోషాలతో జీవించాలని సెంటినరీ కాలనీ కార్మిక క్షేత్రాలలో మహిళలు భోగి వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యమానికి గ్రామ పెద్దలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.హరిదాసుల కీర్తనలు,గంగిరెద్దుల విన్యాసాలు మన సంస్కృతి,సాంప్రదాయాలకు ప్రతీక,సకల సౌఖ్యాలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటూ భోగి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వేణుగోపాల స్వామి ఆలయంలో ఘనంగా గోదాదేవి కళ్యాణం



**అక్షర వేదం: జనవరి 14,రామగిరి**

రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో 700 సంవత్సరాల క్రితం నిర్మించిన శ్రీ శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణం కల్వచర్ల సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి, పాలకమండలి మరియు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది.గోదాదేవి కళ్యాణానికి కల్వచర్లలోని భక్తజనులందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఇట్టి కార్యక్రమానికి ఆర్ జి 3 జిఎం సుంకర మధుసూదన్,మంథని సీఐ రాజు , రామగిరి ఎస్సై శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా రావడం జరిగింది.కళ్యాణం అనంతరం నృత్య కళాకారులతో నృత్య ప్రదర్శన జరిపించారు కళ్యాణం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇట్టి గోదాదేవి కళ్యాణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కల్వచర్ల గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు మరియు కల్వచర్ల ప్రజలందరికీ పేరుపేరునా ఆలయ కమిటీ చైర్మెన్ రేండ్ల కుమారస్వామి ధన్యవాదాలు తెలిపారు.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



**అక్షర వేదం: జనవరి 14,రామగిరి**
తెలంగాణ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నియోజకవర్గ ప్రజలందరికీ, జిల్లా ప్రజలందరికీ,రాష్ట్ర ప్రజలం దరికీ హృదయపూర్వకంగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సందర్భంగా మీరు మీ కుటుంబ సభ్యులందరూ కూడా సంతోషంగా ఉండాలని,మీ జీవితాల్లో మరింత వెలుగు నిండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ మీకు మీ కుటుంబ సభ్యులందరికీ మా మిత్రులకి,అక్క చెల్లెలకి,మా అన్నలకి తమ్ముళందరికీ హృదయపూర్వకంగా మా తరఫున,మా ప్రభుత్వం తరఫున హృదయపూర్వక భోగి,సంక్రాంతి,కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రామాలయంలో ఘనంగా గోదాదేవి కళ్యాణం



**అక్షర వేదం, జనవరి 14 రామగిరి**
రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో శ్రీ కోదండ రామాలయంలో బుధవారం ఘనంగా గోదాదేవి కళ్యాణ వేడుకలు జరిగాయి. భోగి సందర్భంగా దేవాలయంలో అర్చకులు సౌమిత్రి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమపీవీ రావు, ఉప సర్పంచ్ భాద్రపు ప్రవళిక ప్రశాంత్ తోపాటు భారీగా భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వీధిలో ఘనంగా భోగి మంటలు



**అక్షర వేదం/రాయికల్ జనవరి 14:**
రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామం శ్రీ వెంకటేశ్వర స్వామి వీధిలోనీ మహిళలు భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేసి అందరూ కలిసిమెలిసి పాటలు పాడుతూ ఆనందంగా పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కవయిత్రి చిలకమర్రి విజయలక్ష్మి మాట్లాడుతూ భోగి మంట అనేది సామాన్యమైనది కాదని, అగ్నిహోత్రం వంటిదని, మన ఇంటి ముందు భోగిమంట వేస్తే పీడలన్నీ కూడా తొలగిపోతాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బెజ్జారపు లక్ష్మీ రవీందర్, గట్ల లత, సుప్రియ, హరిత, రొట్టెలతిక, రొట్టె విజయ, బుచ్చక్క, మల్యాల లత, నేహశ్రీ, లలిత, శ్రీవల్లి, వైష్ణవి, యువతులు తదితరులు పాల్గొన్నారు.

## శాలిగౌరారంలో ముగిసిన ధనుర్మాస పూజలు

**- అంగరంగ వైభవంగా గోదాదేవి కళ్యాణం**



**అక్షర వేదం/నల్గొండ/ శాలిగౌరారం; జనవరి 14,**
శాలిగౌరారంలో గోదా సమేత సీతారామచంద్రస్వామి దేవాలయంలో ధనుర్మాస పూజలు నెల రోజులపాటు జరిగాయి. ఆలయ ధర్మకర్తలు తిరుప్పవై సేవకాలం అలంకరించి 30వ పాశురం చదివి వినిపించారు. భక్తుల 30 రోజులపాటు వ్రతం ఆచరించారు. చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయమంతా గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఉపాధ్యక్షులు కదారి కళాధర్ రెడ్డి కన్నుమూత

**- విద్య, ఉద్యమం, సేవ రంగాల్లో ఆయన చూపిన అంకితభావం ఆదర్శనీయం**



**అక్షర వేదం,జనవరి 14, రామగిరి**
సెంటినరీ కాలనీకి చెందిన కదారి కళాధర్ రెడ్డి ఈరోజు హైదరాబాదులో చికిత్స పొందుతూ ఈరోజు మృతి చెందారు. వారి అకాల మరణం పట్ల లయన్స్ క్లబ్ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సెంటినరీ కాలనీ ప్రాంతంలో రామగిరి విద్యాసంస్థలను స్థాపించి ఎంతోమందికి నాణ్యమైన విద్యను అందించి సమాజానికి విశేష సేవలు అందించారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో విద్యావంతుల వేదిక చైర్మన్‌గా పనిచేస్తూ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ప్రస్తుతం సింగరేణి సంస్థల్లో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఉపాధ్యక్షులుగా అనేక సేవా కార్యక్రమాల్లో ముందుండి నాయకత్వం వహించిన వ్యక్తి మృతి చెందడం అత్యంత బాధాకరమని క్లబ్ సభ్యులు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ కదారి కళాధర్ రెడ్డి గారు సేవాభావం, నిజాయితీ, సమాజంపై ఉన్న అపారమైన ప్రేమతో అందరి మన్ననలను పొందిన వ్యక్తి. విద్య, ఉద్యమం, సేవ ఇలా మూడు రంగాల్లోనూ ఆయన చూపిన అంకితభావం ఆయనను సమాజంలో ఒక ఆదర్శనీయ నాయకుడిగా నిలిపింది. ఆయన సేవలను స్మరిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కదారి కళాధర్ రెడ్డి కి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు వారి స్వస్థలం పెద్ద లింగాపూర్, ఇల్లంతకుంట మండలం, సిరిసిల్ల జిల్లాలో జరగనున్నాయి తెలిపారు అలాగే వారి కుటుంబానికి మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని పలువురు ప్రార్థించారు.

# గోదావరిఖని లో ఆకట్టుకుంటున్న వింటర్ ఉత్సవ్ మేళా-2026





**జన జాతరను తలపిస్తున్న ఎగ్జిబిషన్.. ఊరు వాడ అందరి చూపు జల కన్యల వైపే...**





**అక్షరవేదం/గోదావరిఖని: జనవరి14**
గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన వింటర్ ఉత్సవ్ మేళా-2026 ఎగ్జిబిషను సంక్రాంతి సంబరాలకు వేదికగా నిలిచింది. రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు మానసిక ప్రశాంతత కొరకు, మనోఉల్లాసం కోసం సకుటుంబ సమేతంగా ఎగ్జిబిషన్లో సందడి చేస్తున్నారు. ఈ సారి ఏర్పాటు చేసిన ప్రదర్శన పిల్లలకు పెద్దలకు, యువతను విశేషంగా ఆకట్టుకుంటుంది. నిర్వాహకులు ఎండి అస్లాం మాట్లాడుతూ, ఇప్పుడు ఏర్పాటు చేసిన ప్రదర్శనలు రామగుండం పారిశ్రామిక ప్రాంతములో మొట్టమొదటి సారిగా సందర్శకులు, యువత మనసు దోచుకునే విధంగా కాశ్మీర్ అందాలు, జల కన్యల విన్యాసాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసామని ప్రజలు యువత అద్భుతమైన మధురానుభూతి పొందుతున్నారని, పిల్లలకు మరింత ఎక్సైట్మెంట్, పెద్దలను ఉల్లాసంతో పాటు కుటుంబ సభ్యులు సరదానుబూతి పొందుతున్నారని తెలిపారు. మహిళల కోసం వివిధ రాష్ట్రాల నుండి గృహోపకరణవస్తువులు, కళంకారి బెడ్ షీట్స్, హ్యాండి క్రాఫ్ట్, జ్యూవలరి ఐటమ్స్, హ్యాండ్ బాగ్స్ మొదలైన ఎన్నోరకాల వెరైటీలు ఇంకా కోలంబస్, జాయింట్ వీల్, క్రాస్ వీల్, బ్రెక్ డాన్స్, జంబోజేట్ మరియు చిన్న పిల్లల పార్క్ లతో ఉల్లాసంగా గడుపుతున్నారని అన్నారు. ఈ ప్రదర్శన ఇప్పటి నుండి 60రోజుల పాటు ఉంటుందని తెలిపారు.



అక్షర వేదం/అడ్డగుట్ట, సికింద్రాబాద్:-జనవరి 14.
నేడు అడ్డగుట్టలో, తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి. మహిళా నాయకులు యశోద గోద, కళాజ్యోతి ఆధ్వర్యంలో మనస్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో వికలాంగుల మహిళలచే ముగ్గుల పోటి నిర్వహించారు. అనంతరం సంగీత, ప్రశాంత్ కుమార్ మరియు కనిష్క, చేతుల మీద ముగ్గులు వేసిన ప్రతి మహిలకు బహుమతులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో టీ.వి.హెచ్చ్.ఎస్.ఎస్.రాష్ట్ర అధ్యక్షులు కిరణ్ గుత్తికొండ, మెరుగు శివక్రిష్ణ, నరేష్ మరియు చంద్రప్పను ఫౌండేషన్ వారు శాలువతో సన్మానించారు.

## రవీంద్ర భారతి లో వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రైడ్ అప్ ఇండియా 2026 అవార్డు ను బండ జగన్ కి ఇవ్వడం జరిగింది..



**అక్షర వేదం/ లకిడి కపుల్ ,రవీంద్ర భారతి :-జనవరి 14.**
రవీంద్ర భారతిలో వల్లూరి ఫౌండేషన్ అధినేత వల్లూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీ సముద్రాల వేణుగోపాల్ చారీ (ఎక్స్ ఎంపి.) శ్రీ ప్రధని రామకృష్ణ గౌడ్ (ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్) శ్రీ దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా బండ జగన్ జి.హెచ్చ్.ఎం.సి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కి ప్రైడ్ అప్ ఇండియా 2026 అవార్డు ల ప్రదానోత్సవం లో ఈ అవార్డు ను బండ జగన్ కి వారి యొక్క విశిష్ట సేవలను గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ ఈ అవార్డు ను అందించారు.

## స్వయంవ్యక్త శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదారంగనాథుల కళ్యాణ మహోత్సవం





**అక్షర వేదం/వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం, వెంకటేశ్వర పల్లి గ్రామం:-జనవరి 14.**

వరంగల్ జిల్లా,రాయపర్తి మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామం (సన్నూరు)లో స్వయంవ్యక్త శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం సన్నూరులో బుధవారం రోజున గోదా రంగనాథుల కళ్యాణ మహోత్సవం,అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు ఆలయ ప్రధాన అర్చకులు ఏ.వి.రంగాచార్య నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి,ఆలయ అభివృద్ధి కమిటీ,ఆలయ అనువంశిక పూజారులు,వికాస తరంగిణి సభ్యులు,సన్నూరు సేవా బృందం,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సంఘ ప్రతినిధుల సంఘసేవ అద్వితీయం

**సంపాదకవర్గ సభ్యులు సూర ఉపేందర్ రెడ్డి**




**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా ,తొర్రూరు మండల కేంద్రం:-జనవరి 14.**

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలోని టీపీటీఎఫ్ భవన్ లో నిన్న జరిగిన తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రత్యేక సమావేశంలో తొర్రూర్,పెద్దవశీగర మండల శాఖల సహకారంతో 105 గురి టిపిటిఎఫ్ వార్షిక సభ్యత్వ రుసుము రూ.లు 21000 టిపిటిఎఫ్ అధికార మాసపత్రిక సంపాదక వర్గ సభ్యులు సూరం ఉపేందర్ రెడ్డి కి అందజేస్తున్న టి.పీ.టి.ఎఫ్ కో-ఆపరేటివ్ సొసైటీ తొర్రూర్ అధ్యక్షులు జంపాల ఉప్పలయ్య,ప్రధాన కార్యదర్శి పేరం ప్రవీణ్ కుమార్ కోశాధికారి తన్నీరు అశోక్ కుమార్. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సోమారపు ఐలయ్య,టి.పి.టి.ఎఫ్. తొర్రూర్ మండల శాఖ అధ్యక్షులు కొండం జనార్ధన్,జిల్లా ఉపాధ్యక్షులు తండ ప్రభాకర్,పిజిహెచ్ఎం జెల్లా లక్ష్మి నారాయణ,కొయ్యడ కుమారస్వామి,భారత వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి ధనుర్మాస ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళి నాయక్



**అక్షర వేదం/అమీనాపురం , కేసముద్రం మున్సిపాలిటీ:-జనవరి 14.**

శ్రీ భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో నిర్వహించిన ధనుర్మాస ఉత్సవాలలో నేడు శ్రీగోదా రంగనాథ స్వాముల కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మహబాద్ శాసన సభ్యులు డా" భూక్యా మురళీనాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ బండారు వెంకన్న, గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్,మాజీ సర్పంచ్ బట్టు శ్రీనివాస్,సతీష్,దేవస్థాన ధర్మకర్తలు వోలం రాజేశ్వర్ రావు,కృష్ణమూర్తి,చిదురాల వసంతరావు,తేరాల సమ్మయ్య కళ్యాణం లో దేవస్థాన అధ్యక్షులు వోలంమురళీ కోశాధికారి కోయగూరి యాకూబ్ రెడ్డి,సెక్రటరీ బచ్చు పరమేశ్వర్ ,బాణాల నాగరాజు శ్రీరాం సంతోష్ పోకల శ్రీనివాస్,కల్లెం శ్రీనివాస్ రెడ్డి, సామ సుధాకర్ రెడ్డి,తరాల వీరేష్ యాదవ్, కత్తెరసాల శ్రీనివాస్, కాటం రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సుందిళ్ల దేవస్థాన డైరెక్టర్ ను సన్మానించిన పురగిరి క్షత్రియ పెరిక సంఘం నాయకుల



**అక్షర వేదం, జనవరి 14, రామగిరి**

రామగిరి మండలం సెంటినరీ కాలనీకి చెందిన పురిగిరి క్షత్రియ పెరిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఆర్జీ -3 ఐఎన్టియుసి బ్రాంచ్ సెక్రటరీ నరేడ్ల శ్రీనివాసరావు ఇటీవల సుందిళ్లలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి డైరెక్టర్ గా నూతన పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో పురిగిరి క్షత్రియ పెరిక సంఘం నాయకులు, టౌన్ అధ్యక్షులు ఉగ్గే కుమార్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని రాజకీయంగా ఎదగాలని తోటి నాయకులు ఆకాంక్షిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, ఉపాధ్యక్షులు దుండే రాజేందర్, మార్త సతీష్, నాయకులు బుద్దే ఉదయ్, కొట్టే భీమయ్య, చింతం మహేందర్, బుద్దే సదానందం, దురిశెట్టి మొగిలి, సందెల కుమారస్వామి, శ్రీరాముల రవీందర్, దుమ్మటి కిరణ్ కుమార్, చింతం కిరణ్ కుమార్, ఉగ్గే కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడే శ్రీగోదా రంగ నాయకుల కళ్యాణ మహోత్సవం




**అక్షర వేదం/హన్మకొండ, ప్రకాష్ రెడ్డి పేట:-జనవరి 14.**

హనుమకొండ ప్రకాష్ రెడ్డి పేట లోగల విఎస్ఆర్ రెసిడెన్సి ఫ్లాట్ నెంబర్ :301 లో శ్రీ గోదాఅబశ్రీశ్రీ రంగనాయకుల కళ్యాణ మహోత్సవం గురువారం రోజున నిర్వహిస్తున్నట్లు తిరునగరి చూడామణి, శ్రీధర్,దీప్తి, సాయిప్రత,షణ్ముఖ ఫణీంద్ర తెలిపారు.

## వైభవంగా గోదామాత కల్యాణం



**అక్షర వేదం/మంథని,జనవరి 14:**

మంథని పట్టణంలోని లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో బుధవారం రోజున ఏకాదశి రోజున శ్రీ గోదా మాత కళ్యాణం ఘనంగా నిర్వహించారు.బ్రహ్మశ్రీ దుద్దిల్ల మారుతి శర్మ గోదాదేవి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. ఎంతో పవిత్రమైన ధనుర్మాసంలో భగవంతుని సన్నిధిలో భజన కార్యక్రమం నిర్వహించడం ఎంతో శ్రేయస్కారం.అందులో భాగంగా స్థానిక లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో నెల రోజుల పాటు భజన కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజున ఎక్కాహం స్థానిక అన్ని వాడలకు చెందిన భజనపరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనాదిగా లక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ నిర్వహన అచ్చులాపురం శ్రీనివాస్,తల్లం శ్రీనివాస్ శర్మ,నల్లగొండ శ్రీనివాస్,ఆలయ అర్చకులు వరప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా చివరి రోజైన రోజున గోదాదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు..

# సంక్రాంతి విశిష్టత



**ప్రతాపగిరి శ్రీనివాస్, వ్యాసకర్త, తపస్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి,**

సంక్రాంతి పండుగ తెలుగువారి జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ఇది సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించినప్పుడు వస్తుంది, ఇది ఉత్తరాయణం ప్రారంభముగా భావిస్తారు. ఈ పండుగను మూడు రోజుల పాటు జరుపుకుంటారు - భోగి, సంక్రాంతి మరియు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాల్గవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు.

### సంక్రాంతి విశేషాలు

- సంక్రాంతి అనగా నూతన క్రాంతి, సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు.
- ఈ పండుగ సందర్భంగా, ప్రజలు తమ ఇళ్లను అలంకరించుకుంటారు, కొత్త బట్టలు ధరిస్తారు మరియు పిండివంటలతో పొంగలి చేసుకుంటారు.
- సంక్రాంతి పండుగ రోజున ఆ కాలంలో సంతోషాలను ఆహ్వానించేందుకు చిహ్నంగా భోగి మంటల్లో పాత వస్తువులను వేసి దగ్ధం చేస్తారు.
- కనుమ పండుగను పశువుల పండుగగా జరుపుకుంటారు, ఈ రోజు పశువులను శుభ్రపరచి, అలంకరిస్తారు

### సంక్రాంతి ప్రాముఖ్యత

సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను గుర్తించడం ద్వారా, మనం మన సంస్కృతి మరియు సంప్రదాయాలను కాపాడుకోవచ్చు. ఈ పండుగ మనకు కుటుంబ విలువలు మరియు సామాజిక బంధాలను గుర్తు చేస్తుంది.

**మీకు సంక్రాంతి శుభాకాంక్షలతో**

ప్రతాపగిరి శ్రీనివాస్, వ్యాసకర్త, తపస్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి,

# వమికకు శుభాశీస్సులు





**అక్షర వేదం/రామగుండం, ఆదిలాబాద్ జిల్లా:-జనవరి 14.**

అమ్మానాన్నల గారాలపట్టిగా
అమ్మమ్మ తాతయ్యల ముద్దుల మనువరాలిగా
నానమ్మ తాతయ్యల ఆప్యాయతానురాగాలతో
నీ బుడిబుడి అడుగుల సవ్వడితో
నీ ముసి ముసి నవ్వుల చిఱుమోముతో
మనసును దోచుకొనే
మదినిండా దాచుకొనే
చిలుక పలుకుల మాటలతో
నీ దాగుడు మూతల సందళ్లు!
మా కుటుంబానికి భళే సరదాలు!
అమ్మానాన్నల ఆలన పాలనలో
నీ చిరుప్రాయపు మధుర జ్ఞాపకాలు
నీ భావి జీవితానికి పునాదులు!
బాల్యం పంచిన మధుర భాషణాలు!
జన్మజన్మలకూ అపురూప ఆభరణాలు!!
చిరంజీవి వమికకు జన్మదిన శుభాకాంక్షలతో...

**మీ.. తాతయ్య**
కొండ్లె శ్రీనివాస్
అడిషనల్ కమీషనర్ ఆఫ్ పోలీస్‌బి రామగుండం.



అక్షర వేదం న్యూస్ రిపోర్టర్ మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జి తరుపున తెలుగు రాష్ట్రాల ప్రజల అందరికీ బోగి,మకర సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు

**...గౌని యాదగిరి అక్షర వేదం.**

# ఎంపీడీవోను కలిసిన కేశిరెడ్డిపల్లి సర్పంచ్ రవి కుమార్..

**- ఉప సర్పంచ్ చింతల రాజు..**



**బచ్చన్నపేట జనవరి 14 (అక్షరవేదం):-** బచ్చన్నపేట ఎంపిడివో మమతా బాయ్ ని కేశిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ ఆరె రవి కుమార్, ఉప సర్పంచ్ చింతల రాజు లు, మర్యాదపూర్వకంగా కలిశారు.ఆమెను శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ లకు అభినందనలు తెలిపారు.గ్రామంలోని సమస్యల పరిష్కారానికి తమవంతుగా సహకరించాలని ఎంపిడివోను కోరారు. గ్రామాభివృద్ధి ధ్యేయంగా పని చేయాలని ప్రజాప్రతినిధులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

# బచ్చన్నపేట మండల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు

**కాంగ్రెస్ నాయకులు జంగిటి విద్యానాథ్**



**బచ్చన్నపేట,జనవరి 14(అక్షరవేదం)** మండల ప్రజలందరూ భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్, ఆకాంక్షించారు. గురువారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆయన మండల ప్రజలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ సంక్రాంతి పండుగ ప్రతి రైతు ఇంట్లో సిరిసంపదలను నింపాలని, మండల ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. రైతులు పండించిన పంటలతో పాడిపంటలు వర్ధిల్లాలని,గ్రామాలన్నీ పండుగ వాతావరణంతో కళకళలాడాలని ఆయన ఆకాంక్షించారు.ప్రజలందరూ ఐకమత్యంతో,సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా విద్యానాథ్ పిలుపునిచ్చారు.

## సంక్రాంతి పండగ భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు : వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**



**ఉమ్మడి వరంగల్, జనవరి 14 (అక్షరవేదం):-** సంక్రాంతి పండుగ అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహత్తర పండుగ అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. రైతులు ఏడాది పొడవునా చేసిన కష్టానికి ఫలితంగా వచ్చే పంటల ఆనందాన్ని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అందరూ కలిసి పంచుకునే పర్వదినమే సంక్రాంతి అని అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు గ్రామీణ జీవన శైలిని, ఐక్యతను, పరస్పర సహకారాన్ని గుర్తు చేస్తాయని తెలిపారు. ప్రత్యేకంగా రైతుల జీవితాల్లో ఈ పండుగ కొత్త ఆశలు, నూతన ఉత్సాహాన్ని నింపుతుందని, మంచి దిగుబడులతో రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. యువత మంచి మార్గంలో ముందుకు సాగుతూ సమాజాభివృద్ధికి తోడ్పడాలని, మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంపీ ఆకాంక్షించారు.వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ, ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో జీవించాలని ఈ సందర్భంగా కోరుకున్నారు. ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, పండుగ స్ఫూర్తితో పరస్పర ప్రేమాభిమానాలు మరింత బలపడాలని తెలిపారు.ఈ శుభసందర్భంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ మరోసారి హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేరడ సంక్రాంతి క్రీడలకు ఎస్సై గండ్రాతి సతీష్ కుమార్ ప్రారంభోత్సవం.





**యువతకు క్రీడల ప్రాధాన్యతపై సందేశం**
**క్రీడలతోనే శారీరక-మానసిక బలం -- నేరడ గ్రామంలో ఎస్సై గండ్రాతి సతీష్ కుమార్ వ్యాఖ్యలు.**
**గ్రామీణ యువత క్రీడల వైపు అడుగులు -- నేరడ సంక్రాంతి క్రీడల్లో ఎస్సై గండ్రాతి సతీష్ కుమార్ హాజరు.**

**మహబూబాబాద్ జిల్లా కురవి జనవరి 14 (అక్షరవేదం):-** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నేరడ గ్రామంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కురవి మండల సబ్ ఇన్స్పెక్టర్ గండ్రాతి సతీష్ కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రీడలను స్వయంగా ప్రారంభించి, యువతను ఉత్సాహపరిచిన తీరు అందరి ప్రశంసలు పొందింది. ఈ సందర్భంగా ఎస్ఐ గండ్రాతి సతీష్ కుమార్ మాట్లాడుతూ, "జీవితంలో ఎదురయ్యే ఎటువంటి ఇబ్బందులైనా తట్టుకునే శక్తి ఒక క్రీడాకారుడికే ఉంటుంది. క్రీడలు యువతను క్రమశిక్షణతో పాటు ధైర్యంగా తీర్చిదిద్దుతాయి" అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచేందుకు క్రీడలు దోహదపడతాయని, పోలీస్ శాఖ ఎప్పుడూ యువతకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎస్ఐ పాల్గొనడం వల్ల క్రీడాకారుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఆయన ప్రతి పోటీనీ ఆసక్తిగా వీక్షిస్తూ, విజేతలకు అభినందనలు తెలియజేయడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు, జిల్లా కార్యదర్శి పట్ల మధు, నేరడ గ్రామ సర్పంచ్ ఇరుగు గౌతమి, వెంకన్న, ఉప సర్పంచ్ దుస్స వెంకన్నలు పాల్గొన్నారు. అలాగే ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ గ్రామ అధ్యక్షులు జక్కుల వెంకన్న, మట్టిపెల్లి రంజిత్, సీపీఐఎం పార్టీ నాయకులు కడియం సత్యం, చేలాగోలా మల్లయ్య, కొండబత్తుల వెంకన్న, జక్కుల మల్లన్న, డాక్టర్ మల్లన్న తదితరులు హాజరయ్యారు. మొత్తంగా ఎస్ఐ గండ్రాతి సతీష్ కుమార్ ప్రోత్సాహంతో నేరడ గ్రామంలో సంక్రాంతి క్రీడలు యువతకు మరపురాని అనుభూతిగా నిలిచాయని గ్రామస్తులు తెలిపారు.

# సంక్రాంతి సందర్భంగా వాలీబాల్ టోర్నమెంట్





**రెండవ విజేతగా అమ్మాయిపల్లి గ్రామ జట్టు**
**అమ్మాయిపల్లి గ్రామ జట్టు కెప్టెన్ సిరసన గండ్ల రాజేష్**

**వనపర్తి జిల్లా (అక్షరవేదం):-** చిన్నంబావి మండల పరిధిలో ఆర్ఎస్పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రెండు రోజుల పాటు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మండలానికి చెందిన యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మాయి పల్లి గ్రామానికి చెందిన జట్టు కెప్టెన్ రాజేష్, శ్యాము, హేమంత్, వంశి, జ్ఞానేశ్వర్, మనీ, విక్రమ్, అన్వేష్, రాకేష్ తదితరులు ఈ జట్టు కూడా పాల్గొనడం జరిగింది. మండల కేంద్రంలో జరిగిన పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో రెండోవ విజేతగా అమ్మాయి పల్లి గ్రామ జట్టు సాధించింది. విజేత జట్టుకు సంక్రాంతి రోజు (జనవరి 15న) అంబేద్కర్ చౌరస్తా, రెండో బహుమతిగా రూ.5,000 నగదు మరియు షీల్డ్ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, గోవిందు శ్రీధర్ రెడ్డి పాల్గొని క్రీడలను ప్రారంభించారు. బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు పరిమళ ప్రకాష్, కేతపాగ మధు, బొరెల్లి రవికుమార్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దేవని రమేష్ మాదిగ, గజ్జె ఈదన్న యాదవ్, కురువ చిన్న మల్లయ్య, రామన్ గౌడు, మాజీ సర్పంచ్ రంజిత్ కుమార్, చిన్నమరూర్ సర్పంచ్ శంకర్, మాజీ ఉప్ప సర్పంచ్ ఆనంద్, సంపంగి మద్దిలేట్టి, వడెమాన్ రామకృష్ణ, మాజీ సర్పంచ్ చక్రదర్ గౌడ్, అమ్మాయి పల్లి గ్రామ యువత మరియు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు. యువత పాల్గొని ఈ టోర్నమెంట్ క్రీడాభిమానులతో ఉత్సాహభరితంగా సాగింది.

# ఐనోల్ గ్రామ అభివృద్ధి కోసం నా మొదటి అడుగు

**మందుముల శివారెడ్డి, మందుముల హర్ష వర్ధన్ రెడ్డి 200 మందితో బీజేపీ లో భారీగా చేరిక.**





**(అక్షరవేదం):- పటాన్ చెరు** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఐనోల్ గ్రామం లో యువత మందుముల శివారెడ్డి, మందుముల హర్ష వర్ధన్ రెడ్డి 200 మంది తో కాషాయ కండువా కప్పుకొని బీజేపీ లో చేరారు, వీరికి ఘన స్వాగతం పలికిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, అనంతరం వారు మాట్లాడుతూ ఐనోల్ గ్రామంలో మందుమూల శివారెడ్డి కుటుంబ సభ్యులు అంటే అందరికీ ఎంతో గౌరవం. ఏ సమస్య వచ్చినా ముందు నిలబడే వ్యక్తులు. దశాబ్దాలుగా ఊరి కోసం ఎంతో కష్టపడ్డారు, మనల్ని నమ్ముకున్న వారి కోసం మంచి చేయాలన్న ఆలోచన శివారెడ్డి కి తీవ్రంగా ఆలోచింపజేశాయి. తన ముఖ్య అనుచరులు అయినా ఇనోల్ గ్రామ పెద్దలు బీజేపీ నాయకులు మల్లారెడ్డి, జగన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్కూరి రాజశేఖర్ రెడ్డి,అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా,మండల ఉపా అధ్యక్షుడు లక్డారం సుధాకర్ రెడ్డి లతో సమావేశమయ్యాము మనం నమ్ముకున్న సిద్ధాంతం వేరు, ఇప్పుడు జరుగుతున్న రాజకీయాలు వేరు. దేశం మొత్తం అభివృద్ధి బాటలో నడుస్తోంది. మన గ్రామానికి కూడా ఆ మార్పు అవసరం.నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న పనులు చూస్తుంటే మనం కూడా భారతీయ జనతా పార్టీలో చేరితేనే మన ఊరికి మంచి జరుగుతుందనిపిస్తోంది అని మా కుటుంబ సభ్యులు అన్నారు.ఆ నిర్ణయానికి కార్యకర్తలందరూ ఏకగ్రీవంగా మద్దతు పలికారు.మరుసటి రోజు ఉదయాన్నే సుమారు 200 మందికి పైగా ముఖ్య కార్యకర్తలము అందరమూ భారీ కాన్వాయ్‌తో జిల్లా కేంద్రానికి బయలుదేరి దారిపొడవునా భారత్ మాతా కీ జై అనే నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది.జిల్లా పార్టీ కార్యాలయానికి చేరుకోగానే, బీజేపీ మెదక్ ఎంపీ రఘునందనరావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజి రెడ్డి, నాయకులతో కలసి ఘన స్వాగతం పలికారు. వేదికపై మా అందరికి కాషాయ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.నేను పదవుల కోసం పార్టీ మారడం లేదు. నా గ్రామాభివృద్ధి కోసం, దేశం పట్ల ఉన్న భక్తితో, దేశ ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచడానికే ఈ అడుగు వేశాను.ఈ రోజు నుండి మేమంతా క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తలుగా పనిచేస్తాము అని అన్నారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు మండలాధ్యక్షుడు కావెల్లి వీరేశం,బైండ్ల కుమార్, సుజాత, ఆనంద్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బిజెపి నాయకులు, బీజేవైఎం నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.